స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## అమరుల ఆశయ సాధనే ప్రభుత్వ ధ్యేయం

• షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరించిన మంత్రి జూపల్లి
• శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ భావోద్వేగం

2



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 61 | సోమవారం, 20 జులై, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 61 | MONDAY, JULY 20, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |



# గాంధీభవన్‌కు రావొద్దు

• గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దు • ఆగస్టు 3 వరకు నేతలంతా క్షేత్రస్థాయిలోనే ఉండాలి • హైదరాబాద్ చుట్టూ తిరుగుతామంటే కుదరదు • ఇన్‌ఛార్జి ఎంపీలు సరిగ్గా పనిచేయకపోతే కఠినంగా వ్యవహరిస్తాం • సర్‌పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూమ్ సమావేశం • పార్టీ ముఖ్యనేతలకు పలు కీలక సూచనలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి • సర్‌ను ఇన్‌ఛార్జ్ మంత్రులు పూర్తి పర్యవేక్షణ చేయాల్సిందేనన్న సీఎం



హైదరాబాద్, జులై 19 (వార్త వేదిక సూర్య):

ఛైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, రేపటి నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్‌ఐఆర్ అంశంపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్‌ఐఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్‌ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. పార్టీ పరంగా ఎస్‌ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందు కెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఛైర్మన్లు బీఎల్‌ఓల నివేదికల కంటే బీఎల్‌ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్‌ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు మిగతా 2లో..



# సింగరేణిని బలోపేతం చేస్తాం

• కరెంట్ కష్టాలకు శాశ్వత పరిష్కారం • కేంద్రంతో పోరాడి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ సాధించాం • ఎల్‌నినో ముప్పును సమష్టిగా ఎదుర్కోవాలి • ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, జులై 19 (వార్త వేదిక సూర్య):

తెలంగాణకు మకుటాయమానమైన సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించిన ఆయన ఇల్లందు నియోజకవర్గంలోని టేకులపల్లిలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం సింగరేణి విస్తరణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కొత్త బొగ్గు బ్లాకుల కోసం చర్యలు తీసుకోకపోవడంతో సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటోందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రంతో పోరాడి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ సాధించామని, ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులను కూడా వేగవంతం చేశామని తెలిపారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు ప్రైవేటు చేతుల్లోకి వెళ్లడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఏజెన్సీ మిగతా 2లో..



## బూతులు, తిట్లు, అసభ్య పదజాలం
# అశ్లీలత కాదు

• ఐపీసీ సెక్షన్ 294(బి) పరిధిలోకి రాదు • స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జులై 19 (వార్త వేదిక సూర్య):

బూతు మాటలు, దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించినంత మాత్రాన, అవి ఎంత అభ్యంతరకరంగా లేదా సభ్యత లేనివిగా ఉన్నప్పటికీ అశ్లీలత నేరం కిందకు రావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 294 కింద ట్రయర్ కోర్టు తనకు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, కేవలం తిట్టడం లేదా అస్లభ్య పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు అని పేర్కొంది. ''ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి. దానిని వినే లేదా చూసే వారి మనస్సులను భ్రష్టు పట్టించేలా, చెడగొట్టేలా ఉండాలి. ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలన్నీ నిజమేనని పూర్తిగా అంగీకరించినప్పటికీ, ఆ మాటలను అశ్లీలమైనవిగా పరిగణించలేము. ఇలాంటి మాటలు ఎంత దూషణతో కూడినవి, వినడానికి వీలులేనివి లేదా సభ్యత లేనివి అయినప్పటికీ, ఇవి ఐపీసీ సెక్షన్ 294 (బి) పరిధిలోకి రావు'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ బూతు మాటలు, అసభ్య పదజాలం వాడకం వల్ల బహిరంగ ప్రదేశంలో ఇతరులకు, ముఖ్యంగా ఫిర్యాదుదారునికి తీవ్ర అసౌకర్యం లేదా ఇబ్బంది కలిగిందని ఎక్కడా రుజువు కాలేదు. ఈ సెక్షన్‌కు ఇది అత్యంత కీలకమైన నిబంధన. ఇది లేనప్పుడు, ఐపీసీ సెక్షన్ 294 (బి) కింద నేరం జరిగినట్లు పరిగణించలేము అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### కేసు నేపథ్యం

తమిళనాడులో 2017 ఆగస్టులో ఒక వ్యవసాయ భూమి గురించి వివాదం చెలరేగింది. ఆ సమయంలో పిటిషినర్‌కు, అతడి బావమరిదికి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై మేనల్లుడితో పిటిషనర్ మళ్లీ గొడవ పడ్డాడు. దీనితో ఆయన బావమరిది జోక్యం చేసుకున్నాడు. కోపంతో పిటిషినర్ తన బావమరిదిని అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించాడు. దీనితో ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్ 294 (బి) అశ్లీలత, సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), 506 (ii) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చింది. దీనితో పిటిషనర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మద్రాస్ హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆరోపణల మిగతా 2లో..

## ప్రజా సమస్యలపై పోరాటమే
# తెలంగాణ రక్షణ సేన లక్ష్యం

• సింగరేణి కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాలు, యువతకు ఉపాధి, రైతులకు రక్షణ, ఉచిత విద్య–వైద్యం, సామాజిక న్యాయమే ఎజెండా • కోరుట్లలో పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన సమితి అధినేత్రి కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జులై 19 (వార్త వేదిక సూర్య):



తెలంగాణ ప్రజల అస్తిత్వం, కార్మికులు, రైతులు, యువత, బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీల హక్కుల పరిరక్షణే తెలంగాణ రక్షణ సేన లక్ష్యమని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కోరుట్లలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభతో పాటు మెట్‌పల్లి, హైదరాబాద్‌లో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 2 వేల మంది కార్మికుల వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కవిత ప్రకటించారు. తెలంగాణ రక్షణ సేన హెచ్చరికలతోనే ప్రభుత్వం నామమాత్రంగా మెడికల్ బోర్డు నిర్వహించిందని, వేలాది మంది ఎదురుచూస్తుండగా కేవలం కొద్దిమందిని మాత్రమే పరిశీలించడాన్ని తప్పుబట్టారు. ప్రతి నెలా రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కార్మికుల సమస్యలపై స్పందించాలని, హెచ్‌ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలు ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు గత చరిత్రనే తవ్వుకుంటూ ప్రస్తుత సమస్యలను విస్మరిస్తున్నాయని కవిత విమర్శించారు. కానిస్టేబుల్ నియామకాల్లో కనీసం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం ఐదు నుంచి ఆరు వేల పోస్టులతోనే సరిపెడుతోందని, దీని వల్ల నిరుద్యోగ మిగతా 2లో..

## బోనాల వేడుకల నుంచి ఎల్‌నినో సమీక్ష వరకు
# ప్రజా సంక్షేమమే ధ్యేయం

• మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు.. • చౌక్కారావుకు ఘన నివాళి • విద్యార్థులకు బ్యాగుల పంపిణీ.. • కరీంనగర్‌లో ఎల్‌నినోపై సమగ్ర సమీక్ష • మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 19 (వార్తా వేదిక సూర్య):

రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతాంగ శ్రేయస్సు, వర్షాభావ పరిస్థితుల నివారణ కోసం ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం నుంచి కరీంనగర్‌లో ఎల్‌నినో సమీక్ష సమావేశాల వరకు పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఆషాఢ బోనాల సందర్భంగా సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మిగతా 2లో..



## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు
# నేడే శ్రీకారం

• పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం • మంత్రి పొంగులేటి శ్రీనివాస్ • క్యూర్ పరిధిలో లక్ష ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం • తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు

హైదరాబాద్, జులై 19 (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్‌లోని పేదల సొంతింటి కలను నిజం చేయబోతున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్యూర్ పరిధిలో లక్ష ఎల్‌ఐజీ ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం శ్రీకారం చుట్టబోతున్నట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హతలు, బ్రోచర్‌ను సోమవారం విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. నగరంలో తొలివిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల విలువైన ప్రాంతాలను గుర్తించినట్లుగా వివరించారు.

### పేదల సొంతింటి కల సాకారం దిశగా

అధునాతన సౌకర్యాలతో పది అంతస్తుల



భవనాల నిర్మాణం చేపట్టి పేదలకు అందిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ యజ్ఞంలా కొనసాగుతుందని మిగతా 2లో..

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 61
సోమవారం 20 జులై, 2026

# సింగరేణిని బలోపేతం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లోని బొగ్గు గనులు గిరిజనులు లేదా ప్రభుత్వ రంగ సంస్థలకే దక్కేలా కేంద్రంతో న్యాయపోరాటం కొనసాగిస్తున్నామని వెల్లడించారు. సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు మానవతా దృక్పథంతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన భట్టి, సంస్థలో పనిచేస్తున్న శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇప్పటికే సింగరేణి కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా అమలు చేశామని, దానిని విద్యుత్ సంస్థలకు విస్తరించిన అనంతరం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.20 కోట్ల బీమా రక్షణ కల్పించే నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పోడు భూముల పట్టాలు పొందిన గిరిజన రైతులకు ఉచిత సౌర విద్యుత్, బోర్ బావులు, పంపుసెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ సౌకర్యాలు కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని చెప్పారు.

వర్షాకాలంలోనే అసాధారణంగా విద్యుత్ డిమాండ్ 11 వేల మెగావాట్ల నుంచి 16,600 మెగావాట్లకు చేరిందని, అయినప్పటికీ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ సేవను బలోపేతం చేశామని, వైద్యరంగంలోని 108 తరహాలో పవర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, అవసరమైన పరికరాలు, సాంకేతిక సిబ్బందితో కూడిన 165 పవర్ అంబులెన్స్‌లు రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తున్నాయని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న ఎల్‌నినో ప్రభావం తెలంగాణపైనా తీవ్రంగా ఉండే అవకాశముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలతో పాటు వన్యప్రాణులకు కూడా తాగునీటి కొరత తలెత్తకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ముప్పుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మీడియా, ప్రజలు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)





యువత తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

కోరుట్లలో బీజేపీ సీనియర్ నేత డాక్టర్ రఘు తెలంగాణ రక్షణ సేనలో చేరడం పార్టీకి మరింత బలాన్నిచ్చిందని పేర్కొన్న కవిత, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తమ పార్టీ ఎదుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో అవినీతిని, బీసీల సమస్యలను ప్రశ్నించినందుకే తనపై కుట్ర చేసి పార్టీ నుంచి బయటకు పంపించారని ఆరోపించారు. కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరబోనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడానికే తెలంగాణ రక్షణ సేనను స్థాపించామని చెబుతూ, ఉచిత నాణ్యమైన విద్య, సంపూర్ణ ఉచిత వైద్యం, యువతకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు, రైతులకు ప్రత్యేక సేవా వ్యవస్థ, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం తమ పార్టీ ప్రధాన హామీలని ప్రకటించారు. అవినీతిని అరికడితే ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌తోనే ఈ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చని ఆమె అన్నారు. రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత ఆరోపించారు. గోదావరిలో నిల్వ చేయాల్సిన నీటి సామర్థ్యం ఉన్నప్పటికీ తగిన నిల్వలు లేకపోవడంతో సాగు, తాగునీటి సంక్షోభం ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయాలకు వేదికగా మార్చారని, మేడిగడ్డతో సంబంధం లేకుండానే నీటిని ఎత్తిపోసే అవకాశాలను ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీలను కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో ప్రజలు ఏ సమస్య అడిగినా సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం పరిపాటిగా మారిందని పేర్కొంటూ, తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయంగా తెలంగాణ రక్షణ సేనకు మద్దతు ఇవ్వాలని కవిత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేనలో చేరిన డాక్టర్ రఘు మాట్లాడుతూ, కోరుట్ల ప్రాంత అభివృద్ధిని వరుస ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ జరగక వేలాది మంది యువత ఉపాధి కోల్పోయారని, బీడీ కార్మికులకు హామీ ఇచ్చిన ఆసుపత్రి కూడా నెరవేరలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కవిత కీలక పాత్ర పోషించినప్పటికీ ఆమెను సొంత పార్టీ నాయకులే అన్యాయంగా పక్కన పెట్టారని ఆరోపించారు. తెలంగాణ రక్షణ సేన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదికగా నిలుస్తుందని ఆయన అన్నారు.

# బోనాల వేడుకల నుంచి ఎల్‌నినో సమీక్ష వరకు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)



మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని కూడా కోరుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో మంచి వర్షాలు కురవాలని రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు, భక్తులకు విజ్ఞప్తి చేశారు. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ నాయకుడు మిరియాల ప్రీతమ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి, సీఎడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజుతో కలిసి విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. మిరియాల ప్రీతమ్ తన ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను మంత్రి అభినందించారు. కరీంనగర్‌లో మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చొక్కారావు తన రాజకీయ గురువని పేర్కొన్న మంత్రి, రాజకీయాల్లో పారదర్శకత, నిజాయితీ, నైతిక విలువలకు ఆయన ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పసిఫిక్ మహాసముద్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలకు తాగునీరు, రైతులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. వర్షాభావాన్ని ఎదుర్కోవడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్న మంత్రి, రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాన్ని తప్పనిసరి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపేలా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ధర్మపురి, కొండగట్టు, కాళేశ్వరం, వేములవాడ దేవాలయాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించాలని సూచించిన మంత్రి, ఈ క్లిష్ట పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి ప్రత్యేక నిధులు విడుదల చేసి అండగా నిలవాలని కోరారు. ప్రకృతి విపత్తును ఎవరూ ఒంటరిగా ఎదుర్కోలేరు.. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కదిలితేనే ఎల్‌నినో సవాల్‌ను అధిగమించగలం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# డ్రగ్స్ నివారణలో భాగస్వాములు కావాలి

- మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్, జులై 19 (వార్తా వేదిక సూర్య): డ్రగ్స్ నివారణలో అందరూ భాగస్వాములు కావాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని 9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ వార్డుల్లో మాదక ద్రవ్యాల నిషేధంపై వార్డు సభ్యులు నాయకులుతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు అనంతరం డ్రగ్స్ పై యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకూడదన్నారు. అలా అయినట్లయితే దేశ భవిష్యత్, సమాజ భవిష్యత్, కుటుంబ భవిష్యత్, వ్యక్తిగత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు.ముఖ్యంగా మత్తు పదార్థాలు, వివిధ రకాల మాదక ద్రవ్యాలు ఉపయోగించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వీటిని రవాణా చేసే వారిని, సహకరించే వారిని శిక్షిస్తుందని, అందుకే చెడు అలవాట్లకు దూరంగా ఉండి యువత బంగారు భవిష్యత్కు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మలిగే మల్లేష్, ఆశా వర్కర్ మాధగోని బాలశ్రీ, అంగన్వాడి ఫర్వీన్ సుల్తాన్, సుర్కంటి బాలకృష్ణ రెడ్డి, బొంగు శ్రీనివాస్ గౌడ్, భీమగోని శ్రీరాములు, మలిగే ఊసయ్య, పాలకూర సాయి, కప్పరి నరసింహ, మలిగే బసవయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# అమరుల ఆశయ సాధనే ప్రభుత్వ ధ్యేయం



హైదరాబాద్, జూలై 19 (వార్త వేదిక సూర్య): ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాలను సాకారం చేస్తూ అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించే సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, "మా చావులతో తెలంగాణ రావాలి" అనే మహోన్నత సంకల్పంతో ఎందరో యువకులు ఆత్మబలిదానం చేశారని గుర్తు చేశారు. అమరవీరుల త్యాగాలను శాశ్వతంగా స్మరించుకునేలా స్థూపం నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు చేరవేయడంలో అమరవీరుల స్థూపం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ తన కుమారుడి త్యాగాన్ని స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టడం అక్కడి వారిని కదిలించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ విమల గద్దర్, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు నేడే శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రెండో విడతలో ప్రకటించిన 2.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా నగరంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించిన ప్రభుత్వం, ఇప్పుడు హైదరాబాద్ నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదల సొంతింటి కలను కూడా సాకారం చేయబోతోందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు

గత ప్రభుత్వాల మాదిరిగా నగరానికి దూరంగా కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కుటుంబాల జీవనోపాధికి, పిల్లల చదువులకు, ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గతేడాది మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో రెండు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, లక్షలాది కుటుంబాలు ఇప్పటికే గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల కొత్త ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని, గతేడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాల జీవితాల్లో సొంతింటి వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.




# గాంధీభవన్‌కు రావొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్‌ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశా లు జారీ చేశారు.

## ఎస్‌ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత

గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్‌ఏ, బీఎల్‌ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. ఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జిల మధ్య సమన్వయం తీసుకురావాలని సూచించారు. ఎస్‌ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలకు రాహుల్ గాంధీని కలిసి ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇవాళ ఉదయం జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జూమ్ సమావేశంలో రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎస్‌ఐఆర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# బూతులు, తిట్లు, అసభ్య పదజాలం అశ్లీలత కాదు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి పిటిషినర్‌ను నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద విధించిన శిక్షలను మాత్రం సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## పోక్సో దుర్వినియోగం

మరో కేసు విచారణ సందర్భంగా, పరస్పరం ప్రేమించుకున్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. యుక్త వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (POCSO) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైనదేనా? అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన కేసును సుమోటోగా విచారణ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.



# కొత్తపేట్‌లో కుబేరా సిల్క్స్ బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించిన నిహారిక కొణిదెల

హైదరాబాద్, జులై 19 (వార్తా వేదిక సూర్య): తెలంగాణలో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి చెందిన కుబేరా సిల్క్స్ తన 5వ బ్రాంచ్‌ను కొత్తపేట్ మెయిన్ రోడ్ లో ప్రముఖ నటి నిహారిక కొణిదెల ప్రారంభించారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ కుబేర సిల్క్స్ లో కలెక్షన్స్ తనకి ఎంతో ఇష్టమని నా దగ్గర అన్ని వెరైటీలు అన్ని కలర్స్ ఎప్పుడు రెడీగా ఉంచుకుంటాను ప్రతి అకేషన్ కి చీరలనే కట్టుకోవడానికి మక్కువ చూపిస్తానని, వారు మరిన్ని బ్రాంచీలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా కుబేరా సిల్క్స్ వ్యవస్థాపకులు ఎం. శ్యాంసుందర్, జి. శ్రీనివాస్, డా. జి. షాలిని మాట్లాడుతూ, నాణ్యత, విశ్వసనీయత, అందుబాటు ధరలతో వినియోగదారులకు ఉత్తమమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో విస్తరణ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో పట్టు చీరలు, బ్రైడల్ కలెక్షన్స్, డిజైనర్ చీరలు, ఫ్యాన్సీ వేర్, సంప్రదాయ దుస్తులు విస్తృతంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు.




# అన్నదాతల కడుపు కొడితే చూస్తూ ఊరుకోం

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్ర హెచ్చరిక**
**-యువనేత కార్తీక్ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలోకి..**
**రైతు గెలిచే దాకా విశ్రమించేది లేదని స్పష్టీకరణ**

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

మా ముత్తాతల కాలం నుంచి రక్తాన్ని చెమటగా మార్చి, రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసుకుంటున్న మా భూములను ఇప్పుడు ఏ హక్కుతో లాక్కుంటారు? మా నోళ్లు కొట్టి మమ్మల్ని రోడ్డున పడేస్తే.. మా భూములను ఎవరు కాపాడతారు? -- ఇది శంషాబాద్ మండలం, బహదూర్‌గూడ రైతుల గొంతులోంచి వస్తున్న కేవలం ఆవేదన మాత్రమే కాదు... పాలకుల అహంకారాన్ని, అరాచకాలను దహించివేసేలా రగిలిపోతున్న సింహగర్జన!

?తమ జీవనాధారమైన భూములను హరించేందుకు తెరవెనుక జరుగుతున్న కుట్రలపై అన్నదాతలు కరచాలనం చేశారు. హక్కుల రక్షణ కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా రైతాంగం ఇచ్చిన పిలుపు అందుకోవడమే ఆలస్యం... బహదూర్‌గూడ గ్రామానికి గ్రామస్తులు, యువత, వృద్ధులు, రైతులు ఉప్పెనలా తరలివచ్చారు. బహదూర్‌గూడలో నేడు ఆందోళనకారుల రాకతో జనసముద్రం తలపించింది. తమ గుండెల్లో భూములు పోతాయన్న ఆందోళన రగులుతున్నా, ఆ భయాన్ని ఆవేశంగా, ఆయుధంగా మార్చుకుని హక్కుల కోసం ప్రజలంతా ఒక్కటయ్యారు. ప్రతి నాయకుడి మాటను నిశితంగా గమనిస్తూ, తమ ఐక్యతను చాటిన ప్రజా ప్రవాహానికి అక్కడ కనిపించిన దృశ్యాలే సజీవ సాక్ష్యం. నేడు బహదూర్‌గూడలో వినిపించిన ఈ ధిక్కార స్వరం.. కేవలం ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాదు, అన్యాయానికి గురవుతున్న తెలంగాణ రైతాంగం మొత్తం వినాల్సిన గళంగా మారింది. పాలకుల గుండెల్లో వణుకు పుట్టించేలా సాగిన ఈ మహాధర్నా ఉమ్మడి పోరాటానికి సరికొత్త నాంది పలికింది. భూమి కోసం సాగుతున్న ఈ ఉత్కంఠభరిత



న్యాయపోరాటంలో రైతులకు తామున్నామంటూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, యువనేత కార్తీక్ రెడ్డి నేరుగా క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. బహదూర్‌గూడకు చేరుకున్న వీరు... బాధిత రైతుల గోడును, పాలకుల వేధింపులను, అధికారుల మొండి వైఖరిని అత్యంత ఓపికగా అడిగి తెలుసుకున్నారు. కన్నీరు పెట్టుకున్న మహిళా రైతులను ఓదారుస్తూ, వారికి కొండంత భరోసానిచ్చారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి విలేకరుల సమావేశంలో పాలకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నదాతల కడుపు కొట్టి, కంటిమీద కునుకు లేకుండా చేస్తూ, వారి సాగు భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. రైతుల భూముల జోలికి వస్తే సహించేది లేదు. ఇది ప్రజాస్వామ్యమా? లేక పాలకుల అరాచక రాజ్యమా? న్యాయం జరిగే వరకు, మీ భూములు మీ చేతుల్లోనే సురక్షితంగా ఉండే వరకు మీతో పాటే ఉంటాం.. మీతో పాటే రోడ్లపైకి వచ్చి పోరాడుతాం, అని ఆమె ప్రభుత్వానికి ఘాటు హెచ్చరికలు జారీ చేశారు. ?ఈ సందర్భంగా యువనేత కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల భూ పోరాటానికి యువత మొత్తం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

న్యాయం కోసం సాగే ఈ పోరాటంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, చట్టపరంగా, రాజకీయంగా రైతులకు పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. రైతుల కన్నీరు ఊరికే పోదని, పాలకుల పతనం ఇక్కడి నుంచే మొదలవుతుందని హెచ్చరించారు. భూమి అనేది రైతుకు కేవలం ఒక మట్టి ముక్క కాదు.. అది వారి ఆత్మగౌరవం, జీవనాధారం, ప్రాణం. ఆ ప్రాణాన్ని హరించేందుకు చూస్తే ఏ శక్తీ మిగలదని స్థానిక రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బహదూర్‌గూడలో రేగిన ఈ భూపోరాట జ్వాల... పాలకుల అణచివేత ధోరణిని దహించే వరకు చల్లారేది లేదని స్థానిక నాయకులు స్పష్టం చేశారు. మా భూములు మాకు దక్కే వరకు, అన్నదాత గెలిచే వరకు ఈ ఉమ్మడి పోరాటం ఆగే ప్రసక్తే లేదు, అవసరమైతే జైలుకైనా వెళ్తాం కానీ భూములను మాత్రం వదులుకోం అని యువత, రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు.



## పర్యావరణహితంగా ఈదమ్మ--పోచమ్మ బోనాల ఉత్సవాలు..

**వినూత్న ఏర్పాట్లకు ఉత్సవ కమిటీ నిర్ణయం**

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడలోని చారిత్రక ఈదమ్మ--పోచమ్మ దేవాలయ బోనాల ఉత్సవాలను ఈ ఏడాది పర్యావరణహితంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ నిర్ణయించింది. వచ్చే నెల 9వ తేదీన జరిగే ఉత్సవాల్లో భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ పిలుపు నిచ్చింది. ఆదివారం ఉదయం హైదర్గూడ ప్రణవ భక్త సమాజం, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్సవాలను ఆదర్శవంతంగా నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. ఉత్సవాలు వచ్చే నెల 9వ తేదీన ఉదయం ప్రారంభమై సాయంత్రం వరకు వైభవంగా కొనసాగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ స్వచ్ఛందంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నందించాలని వారు కోరారు.

## ఆదర్శ కాలనీలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి బీఆర్ఎస్ సహకారం

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :



మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీఎల్ఓలతో కలిసి ప్రజలకు సహకరిస్తూ ఓటరు నమోదు, సవరణకు సంబంధించిన ఫారాలను నింపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు, చిరునామా మార్పు, పేరు సవరణ, ఇతర మార్పులు అవసరమైన వారు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పూరి జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :



నార్సింగ్ సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ గేటెడ్ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించిన శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి ఎమ్మెల్యే భక్తిశ్రద్ధలతో స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంగా, సుభిక్షంగా జీవించాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు జగన్నాథ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## రామకృష్ణాపురంలో వైభవంగా శ్రీ జగన్నాథ్ రథయాత్ర

**ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి**

మహేశ్వరం జులై 19 వార్త వేదిక సూర్య

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని అష్టలక్ష్మి దేవాలయం నుండి శ్రీ జగన్నాథ్ రథయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నా. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ..శ్రీ జగన్నాథ స్వామి వారి ఆశీస్సులు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నాను. సమాజంలో భక్తిభావం, సోదరభావం పెంపొందడానికి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయి. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధురఉపేందర్ రెడ్డి, ప్రణవానంద ప్రభు జి,నర్సింగ్ ప్రభు జి, శ్రీనివాస్ ప్రభు జి,అష్టలక్ష్మి దేవాలయం చైర్మన్ శ్రవణ్, సెక్రటరీ సుధాకర్ గుప్తా, ఐయిత అంజయ్య, శ్రీధర్ కుమార్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, శ్రీధర్, రమేష్, పెద్దవల సైదులు, విప్లవ రెడ్డి, సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

# బహదూర్‌గూడలో సెగలు రేపుతున్న భూసేకరణ వివాదం!





**రైతుల అనుమతి లేకుండా భూములు లాక్కుంటే ఊరుకోం: బీజేపీ ధర్నా**
**బాధితులకు అండగా ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్**
**చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుల ఆధ్వర్యంలో భారీ ఆందోళన.. కదలివచ్చిన శ్రేణులు**

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

ప్రభుత్వ అధికారులు రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలకు వ్యతిరేకంగా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో నిరసన జ్వాలలు వ్యక్తమయ్యాయి. భూ రక్షణ కోసం గ్రామ రైతులు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పూర్తి సంఘీభావం ప్రకటించింది. ఆదివారం గ్రామంలో నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,

రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ , బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి గారు, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ (కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నేతలు రైతులతో ముఖాముఖి సమావేశమై, భూసేకరణ పేరుతో స్థానికంగా జరుగుతున్న అన్యాయాలను, రైతుల ఆందోళనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, రైతుల భూములు కేవలం ఆస్తులు మాత్రమే కాదని, అవి వారి కుటుంబాల జీవనాధారమని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నైనా బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు మారడం లేదని, బలవంతపు భూసేకరణ ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తాము విశ్రమించేది లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల హక్కులను పరిరక్షించేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాతలకు అన్యాయం జరిగితే పార్టీ తరఫున క్షేత్రస్థాయి నుండి ఢిల్లీ స్థాయి వరకు పోరాటం చేస్తామన్నారు. రైతుల అనుమతి లేకుండా, వారికి కనీస సమాచారం ఇవ్వకుండా భూములను స్వాధీనం చేసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశాలను ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను తక్షణమే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయబద్ధమైన పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ.. రైతులు ఎన్నో ఏళ్లుగా కష్టపడి సాగు చేసుకుంటున్న భూములపై ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలబడుతుందని, అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

?- న్యాయమైన పరిష్కారం చూపాలి: రాజ్ భూపాల్ గౌడ్ రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ఆందోళనలను వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని, వారి సందేహాలకు సమాధానం చెప్పి, న్యాయమైన పరిష్కారం చూపాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ నేతలు మహేష్ యాదవ్, బండ్లగూడ జాగీరు బీజేపీ నాయకులు నరేష్ యాదవ్, పవన్ సాయి, భగవంత్ రెడ్డిలతో పాటు వందలాది మంది కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో మహిళ అదృశ్యం..

**ఆచూకీ తెలిపితే పోలీసులకు సమాచారం ఇవ్వండి**

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రేమావతిపేట్ భవానీనగర్‌కు చెందిన విశ్లావత్ లలిత (29) అనే గృహిణి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త వి. భాస్కర్ ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లలిత ఆచూకీ తెలిసిన వారు సమీపంలోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు లేదా పోలీసుల అత్యవసర సేవ 100 / 112కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు.

## ఆరాంఘర్‌లో బాలిక అదృశ్యం..

**రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు**



రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ ఎక్స్ రోడ్ ప్రాంతానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా రాజేంద్రనగర్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఉత్తర ఫల్గుణి నక్షత్రం సందర్భంగా అంబికా కాలనీలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు

బాలానగర్ జులై 19: (వార్త వేదిక సూర్య)



కూకట్ పల్లి నియోజకవర్గంలో బాలానగర్ అంబికా కాలనీలో గల శ్రీ లక్ష్మీనారాయణ గురుస్వామి వారి పూజా మందిరంలో శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి మాస జన్మనక్షత్రమైన ఉత్తర ఫల్గుణి సందర్భంగా అత్యంత వైభవంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. గత 53 నెలలుగా ఎలాంటి విరామం లేకుండా ప్రతి నెలా ఈ మహత్తర సేవా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి సంప్రదాయబద్ధంగా అష్టాదశ అభిషేకాలు, పడి పూజ, అయ్యప్ప భజనలు, హారతులు, మంత్రోచ్చారణలు అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో మారుమోగిన భజనలు, “స్వామియే శరణం అయ్యప్ప” నామస్మరణతో పూజా మందిరం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అభిషేకాలు, పడి పూజ అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులందరూ పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా భావంతో భక్తులు స్వచ్ఛందంగా సహకరిస్తూ కార్యక్రమం విజయవంతం కావడానికి తమ వంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ గురుస్వామి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో గత 53 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా ప్రతి నెలా ఉత్తర ఫల్గుణి నక్షత్రం సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భక్తుల సహకారం, స్వామివారి కృప వల్లే ఈ సేవా కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మరింత మంది భక్తులు ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంపొందించడంతో పాటు, పరస్పర సేవాభావం, ఐక్యత, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచింది. ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ పూజలు బాలానగర్ పరిసర ప్రాంతాల్లోని అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారి విశేష ఆదరణ పొందుతున్నాయి.

# కుల హక్కుల సాధనకు కుల ధ్రువీకరణ పత్రమే కీలకం



**మదారి కురువ--మదాసి కురువ కులజుల అవగాహన సదస్సు**
**- ప్రతి కుటుంబం తమ కుల ధ్రువీకరణ పత్రాలను సక్రమంగా పొందడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్. వెంకటేష్**

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్‌లో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం ప్రాంగణంలోని బీర లింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో తెలంగాణ మదారి కురువ--మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ మండల శాఖ ఆధ్వర్యంలో కులజుల అవగాహన సదస్సు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కుల హక్కుల పరిరక్షణ, కుల ధ్రువీకరణ పత్రాల సాధన, రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, మాజీ కౌన్సిలర్ డి. రంగన్న, సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు హాజరయ్యారు. జేఏసీ కన్వీనర్ కురువ చిన్న మల్లయ్య, రాష్ట్ర కోశాధికారి పసుపుల అశోక్, రాష్ట్ర నాయకుడు తిక్కన్న మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రం సాధించుకోవడం ద్వారా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. గత 76 సంవత్సరాలుగా మదారి కురువ--మదాసి కురువ కులస్తులు కోల్పోయిన హక్కులు, వాటికి దారితీసిన కారణాలు, వాటిని తిరిగి సాధించు కునేందుకు చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం తమ కుల ధ్రువీకరణ పత్రాలను సక్రమంగా పొందడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన తెలంగాణ మదారి కురువ--మదాసి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాజేంద్రనగర్ మండల కమిటీని సభలో పరిచయం చేశారు. కుల అభ్యున్నతి కోసం మండల కమిటీ సేవలను ప్రతి కులజుడు వినియోగించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. సమాజ ఐక్యత, హక్కుల పరిరక్షణ, యువత భాగస్వామ్యం, విద్యా ప్రగతి వంటి అంశాలపై కూడా సభలో చర్చ జరిగింది. కార్యక్రమంలో అశోక్ గ్రాండ్ హోటల్ యజమాని అశోక్, బెల్లంపల్లి వెంకటేష్, బాలరాజు అడ్వకేట్, పోతురాజు మల్లేష్, కిష్టప్ప, గిర్ని రాములు, ఉప్పల్ శ్రీను, సెంట్రింగ్ శంకర్, వెంకటరమణ, రాజలింగం, నామాల రాము, మహేందర్, రఘువీర్, శివకుమార్, శేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 61
సోమవారం
20, జులై 2026



## జాతీయ నులిపురుగుల నివారణ మాప్-అప్ రౌండ్‌ను విజయవంతం చేయాలి: డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి

రాజేంద్రనగర్, జులై 19 (వార్త వేదిక సూర్య) :

రంగారెడ్డి జిల్లాలో రేపు జాతీయ నులిపురుగుల నివారణ మాప్-అప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. స్వర్ణకుమారి తెలిపారు. ప్రధాన విడతలో ఆల్బెండజోల్ నులిపురుగుల నివారణ మాత్ర తీసుకోలేకపోయిన 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల చిన్నారులు, విద్యార్థులు ఈ మాప్-అప్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని మాత్ర తీసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంస్థల ద్వారా ఈ మాత్రలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గడంతో పాటు పోషకాహారం శరీరానికి సక్రమంగా అందుతుంది. దీంతో శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడి పిల్లల ఆరోగ్యం బలోపేతం అవుతుందని డా. స్వర్ణకుమారి వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో ఇప్పటివరకు మాత్ర తీసుకోని ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని పిల్లలను నులిపురుగుల బారినుంచి రక్షించాలని కోరారు.

## ఓటరు జాబితా సవరణలో ప్రజలు భాగస్వాములు కావాలి

### బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్

సికింద్రాబాద్, జూలై 19(వార్త వేదిక సూర్య)



ఓటరు జాబితా సవరణలో ప్రజలు భాగస్వాములు కావాలని బిఆర్ఎస్ పార్టీ మహిళ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్‌లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, బీఎల్ఓ అఖిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ూ×= అవగాహన పోస్టర్లను గృహాలు, అపార్ట్‌మెంట్ సముదాయాల వద్ద అంటిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ మాట్లాడుతూ...ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ అఖిల తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి

దేవరకొండ జూలై 19 (వార్తా వేదిక సూర్య)



పి.ఏ.పల్లి మండల పరిధిలోని శరత్ ఏసీ గార్డెన్‌లో నిర్వహించిన నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవంలో, వద్దిపట్ల గ్రామానికి చెందిన కుంటిగొర్ల రామయ్య యాదవ్ గారి కుమార్తె సమీక్ష మరియు కుమారుడు స్వాతిక్ యాదవ్లను టీపీసీసీ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎల్లయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు , డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి పి.ఏ.పల్లి సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి వద్దిపట్ల మాజీ సర్పంచ్ అంజనేయులు గౌడ్ పాల్గొని ఆశీస్సులు అందజేశారు

ఈ సందర్భంగా డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం మరియు విజయాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటాను : బండి రమేష్



కూకట్ పల్లి జూలై 19 (వార్త వేదిక సూర్య)

కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండి రమేష్ గారిని ఆంజనేయ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ నివాసితులు ఈరోజు శ్రీ హిమదుర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవల నిర్వహించిన బైలాస్ కమిటీ సమావేశంలో కాలనీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బండి రమేష్ గారు అందించిన అమూల్యమైన సలహాలు, సూచనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా తమకు మార్గదర్శకత్వం వహిస్తూ, కాలనీ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

ఈ సందర్భంగా బండి రమేష్ గారు మాట్లాడుతూ, “నేను కేవలం ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, ఆంజనేయ నగర్ కాలనీ నివాసుడిగా కూడా మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. కాలనీ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో మీతో కలిసి పనిచేస్తూ, మీకు నిరంతరం తోడుగా నిలుస్తాను” అని హామీ ఇచ్చారు. బండి రమేష్ హామీపై కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, గంట సుబ్బారావు, రామానుజన్ రెడ్డి, ధర్మారావు, ప్రతాప్, హనుమాన్, శ్రీనివాస్, శ్యామ్, చక్రధర్, సుబ్బు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## కిషోర బాలికల్లో ఆరోగ్యం, శారీరక మార్పులపై అవగాహన అవసరం: సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్



రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :

కిషోర బాలికలు ఆరోగ్యం, యుక్తవయస్సులో శారీరకంగా వచ్చే మార్పులపై సరైన అవగాహన కలిగి ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ సూర్యకిరణ్ సూచించారు. విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా భారతి స్వచ్ఛంద సంస్థ పేద బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి అవసరమైన సహకారం అందించడం అభినందనీయమన్నారు.

సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు బాలికలు జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారిలో చైతన్యం పెంపొందుతుందన్నారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుంటూ శారీరకంగా దృఢంగా ఉండాలని, ఆరోగ్యం మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పేద విద్యార్థినులకు వివిధ రకాల అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాలయ ప్రిన్సిపాల్ జుమిలాల్, సమస్త కోఆర్డినేటర్ స్వప్న, శైలజ, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఓటరు సవరణలో మీ సహకారం

### ప్రజాస్వామ్యానికి మీ సేవ

### బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్

సికింద్రాబాద్, జూలై 19(వార్త వేదిక సూర్య)

మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బాబా బాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలీం బాయ్, చింతకింది మల్లేష్, శీలం సాయి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందించారు. అలాగే మాజీ వార్డ్ సభ్యుడు, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మంద జగన్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్



నాయకులు మంద జగన్ మాట్లాడుతూ...ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

## మత్స్య సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో నల్గొండ పట్టణంలో బీఎన్ఎస్ సెక్షన్ 163 (సెక్షన్ 144) అమలు



### జూలై 20, 21 తేదీల్లో ఎన్నికల ప్రాంగణం పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

నల్లగొండ బ్యూరో, జులై 19 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసీ గ్రామానికి చెందిన మత్స్య శాఖ సహకార సంఘం లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నల్గొండ పట్టణంలోని మహిళా సమాఖ్య భవన్, మిర్యాలగూడ రోడ్ (డీటీసీ సమీపంలో) నిర్వహించనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూలై 20, 21 తేదీల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సీఆర్పీసీ సెక్షన్ 144) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కేంద్రం మరియు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సెక్షన్ 163 అమలులో ఉన్న సమయంలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా చేరడం, అనుమతి లేని ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, సభలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు, వారి ప్రతినిధులు, సభ్యులు, మద్దతుదారులు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.






## మహేశ్వరం ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా గద్దగుటి ఎట్టయ్య ముదిరాజ్

మహేశ్వరం జులై 19 వార్త వైదిక సూర్య



మహేశ్వరం గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని ముదిరాజ్ సంఘం పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ నూతన కమిటీని ఎన్నుకోనరు,, అనంతరం సంఘం అభివృద్ధికి ఇంతకాలం విశేష సేవలు అందించిన పాత కమిటీ సభ్యులను సంఘ పెద్దలకు పూలమాలలు వేసి, శాల్వాలతో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. అనంతరం నూతన కార్యవర్గానికి బాధ్యతలను అప్పగించారు. ?సంఘం బలోపేతానికి, ముదిరాజ్ కులబాంధవుల సంక్షేమమే ధ్యేయంగా ఈ నూతన కమిటీ పనిచేస్తుందని పెద్దలు ఈ తెలిపారు. ?నూతన కార్యవర్గ, అధ్యక్షులు కర్రోల చంద్రయ్య, కాకి ఈశ్వర్, కావాలి జంగయ్య, ?అధ్యక్షులు గద్దగూటి ఎట్టయ్య, ?ఉపాధ్యక్షులు కాకి పరమేష్, కురమిద్ద లింగామయ్య, కాకి మల్లేష్, సుంచు సురేష్, ?ప్రధాన కార్యదర్శి కటికల ధనంజయ్, ఉప కార్యదర్శి కాకి రాజేష్ కుమార్, ?కోశాధికారి మొలగాసి మహేష్, ప్రచార కార్యదర్శి పల్లెమోని అశోక్, యూత్ అధ్యక్షులు గద్దగూటి యాదయ్య, యూత్ ?ఉపాధ్యక్షులు మొలగాసి రవి, నడికుడ రాకేష్, సుంచు శివ కుమార్, సలహాదారులు, సభ్యులతో కూడిన నూతన కార్యవర్గం ఏర్పడింది. ?ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాత కమిటీ సభ్యుల అనుభవాలను, సలహాలను తీసుకుంటూ సంఘం బలోపేతానికి, ముదిరాజ్ సోదరుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. సంఘం సభ్యులందరినీ కలుపుకుంటూ, గ్రామంలో పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహం ఏర్పాటు, ముదిరాజ్ భవన నిర్మాణ త్వరలోనే చేపడుతాం మరియు నిరుపేద కులబాంధవుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి: అందే లక్ష్మణ్ రావు

రాజేంద్రనగర్, జులై 19 ( వార్త వేదిక సూర్య ) :



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజ్యాంగ బద్ధమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ మణికొండ, నెక్నంపూర్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఆలస్యం నవీన్ కుమార్, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ తదితరులు మణికొండ, నెక్నంపూర్, పుప్పాలగూడ ప్రాంతాల్లో సేకరించిన వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 60 శాతం ఫారాలు పంపిణీ కాగా, కేవలం 25 శాతం మాత్రమే తిరిగి అందినట్లు తెలిపారు. బీఎల్ఓల వివరాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ఫారాలు పొందడంలో ఇబ్బందులు, 2002 ఓటరు వివరాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పలువురు ఓటర్లు సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు అందే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైందని, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఓటర్ జాబితా సవరణలో పాల్గొని భవిష్యత్తులో సరైన ప్రజాప్రతినిధిని ఎన్నుకునే హక్కును వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ఫారాలు తీసుకురావడం, వాటిని పూరించడం, 2002 నాటి ఓటరు వివరాలతో ప్రస్తుత ఓటును మ్యాపింగ్ చేయడంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేలా నెక్నంపూర్ డివిజన్ పోలింగ్ కేంద్రాలు 29 నుంచి 57 వరకు ఉన్న బీఎల్ఓలను ఒకేచోట, మణికొండ డివిజన్ పోలింగ్ కేంద్రాలు 58 నుంచి 85 వరకు ఉన్న బీఎల్ఓలను మరో కేంద్రంలో అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఓటర్లు సులభంగా తమ వివరాలను సవరించుకునే అవకాశం ఉంటుందని అందే లక్ష్మణ్ రావు సూచించారు.

## కేశంపేటలో ఏఐటీయూసీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు ఘనంగా నిర్వహణ

రాజేంద్రనగర్ జులై 19 ( వార్త వేదిక సూర్య ) :




తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు ఆదివారం కేశంపేట మండల కేంద్రంలోని చిల్డ్రన్ మైసమ్మ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఎండి షరీఫ్, పద్మమ్మ, రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, కార్మిక ఐక్యతపై ప్రసంగించారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి సభా ప్రాంగణం వరకు గ్రామ పంచాయతీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆగిరాల రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్య నాయక్, వీరేశం, జి. యాదయ్య, పి. జంగయ్య, గోపాల్, పద్మమ్మ, రాములమ్మ, ఈదమ్మతో పాటు పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.




# నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య చేసిన విమర్శలను తాము తీవ్రంగా ఖండన

నల్గొండ టౌన్ జులై 19 వార్త వేదిక సూర్య

నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి పత్రికా ప్రకటనలలో తెలియజేశారు తాము నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టిన ఫ్లైఓవర్ పూర్తయి రెండు నెలలు అవుతున్న ప్రారంభించక,ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు, మీరు...డ్రామాలు ఆడుతున్నారు . ఫ్లై ఓవర్ ప్రారంభంలో జాప్యం వల్ల అనేక ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు కోల్పోతుంటే.. స్థానిక ప్రజలు, మీడియా మిత్రులు కంచర్ల భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకొని వస్తే... ప్రజల కొరకు మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాను పోలీసులతో దౌర్జన్యంగా దాడి చేయించింది మీరు కాదా రెండు నెలలు ఓపిగ్గా ఎదురుచూసిన తర్వాత... ప్రజల ప్రాణాలు పోతుంటే చూడలేక తప్పనిసరి పరిస్థితులలో ధర్నా చేయాల్సి వచ్చింది. మీలాగా జగదీశ్ రెడ్డి ప్రారంభించవలసిన నలగొండ ఆర్డిఓ కార్యాలయాన్ని... తిప్పర్తి మోడల్ స్కూల్ ను... తాళాలు పగుల కొట్టి, దౌర్జన్యంగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించినట్లు మేమేమి ఫ్లైఓవర్ ప్రారంభించలేదే ! మీరు వాగ్దానం చేసి సాధించలేకపోయిన బత్తాయి మార్కెట్ ప్రారంభం నాడు.. మీరు చేసిన నిర్వాకం అప్పుడే మర్చిపోయారు అనుకున్నారా? మెడికల్ కళాశాల,మేము పూర్తి చేశాం, మెడికల్ కళాశాలకు మీరు ఏమైనా నిధులు తెచ్చినట్టు జీవో చూపిస్తారా... ఐటీ మంత్రిగా ఉండి.. వాగ్దానం చేసి..ఐటి టవర్ ను తేలేక పోయిన అసమర్థులు మీరు కాదా మేము తెచ్చిన ఐ టి టవర్ ను నిరుపయోగంగా ఉంచింది మీరు కాదా? +ూ ా జీ.762...తేది, 29-09-2023 ద్వారా 216 కోట్ల వ్యయంతో ఇప్పుడు జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులు మా హయాంలో మంజూరు చేయించినవి కావా? ఇప్పుడు నగరంలో జరుగుతున్న సిసి రోడ్ల పనులు మేము మా తెచ్చిన నిధులు కావా? 36 కోట్ల వ్యయంతో మేము మంజూరు చేసిన ప్రతిష్టాత్మక ఎన్జి కళాశాల ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారు.. పానగల్ ట్యాంక్ బండ్ సుందరీకరణ, పచ్చల,చాయ వెంకటేశ్వర, దేవాలయాల అభివృద్ధి శిల్పారామం నల్లగొండ కళాకారుల కలల రూపంనల్లగొండ కళాభారతి కొరకు కెటాయించిన నిధులు ఏమయ్యాయి మేము 6 కోట్ల వ్యయంతో నిర్మించిన..నల్లగొండ కే తలమానికంగా నిలిచే ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ను... స్వార్థంతో మీ సౌకర్యం కోసం మీ క్యాంపు కార్యాలయం గా మార్చుకున్నది నిజం కాదా నిబంధనల విరుద్ధంగా, నిర్మాణాలు లేకుండానే వివిధ వెంచర్లలో కార్పొరేషన్ నిధులతో రోడ్లు వేయించి అక్రమాలకు పాల్పడింది మీరు కదా! ఇదే



కాదు,, 23 సంవత్సరాలలో మీ శాసనసభ్యుడు నల్లగొండకు చేసిన అభివృద్ధి, ఐదు సంవత్సరాలలో.. ఒక సంవత్సరం ఎన్నికలు రెండు సంవత్సరాలకు కరోనా పోను..మిగతా రెండు సంవత్సరాలలో.. మా శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి నల్లగొండ అభివృద్ధి పై మీతో ఎక్కడ,ఏ సెంటర్లో చర్చించడానికైనా మేము సిద్ధంగా ఉన్నాం నల్లగొండ కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలు, అసమర్థమైన పాలనపై ఉన్న తీవ్ర వ్యతిరేకతను,కప్పిపుచ్చుకోవడానికి, మీరు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు.... ప్రజలు అంతా గమనిస్తున్నారు.. నల్లగొండ నగరంలో మీరు పోలీసులను, అధికారులను, అడ్డం పెట్టుకొని సృష్టిస్తున్న అరాచకాలు, భూ కబ్జాలకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. మరో రెండు సంవత్సరాలలో...నల్లగొండ ప్రజల ఆదరణతో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం... నల్లగొండ మేయర్ పీఠం మళ్ళీ బి ఆర్ ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయం ??ఇప్పటికైనా...తప్పుడు విమర్శలు మాని నల్లగొండనగర అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించండీ... కనీసం ప్రజలలో మర్యాద అయిన దక్కుతుంది.



## దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసిన డిండి మండలం విరబోయినపల్లి, శక్క తండా గ్రామాల నాయకులు

దేవరకొండ జులై 19 (వార్తా వేదిక సూర్య ):-

డిండి మండలం విరబోయినపల్లి, శక్క తండా గ్రామాలకు చెందిన నాయకులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,గ్రామాల సమస్యలు మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ గారితో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విరబోయినపల్లి, శక్రు తండా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## జర్పుల పుట్టాని మృతి చాల బాధాకరం కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ జులై 19 (వార్తా వేదిక సూర్య ):-



చింతపల్లి మండల పరిధిలోని భోత్య తండా కు చెందిన జర్పుల పుట్టాని మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ భోత్య తండా కు చేరుకోని పుట్టాని పార్థివ దేహానికి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అలివేలు భీమ నాయక్,రమావత్ కళ్యాణ్, రమావత్ భీమ ,కొర్ర తావు,బద్దు నాయక్,రవి, తదితరులు పాల్గొన్నారు

## అమరుల యాదిలో... గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

చండూరు జులై 19 (వార్తా వేదిక సూర్య)



కల్లు గీత వృత్తిలో ప్రమాదాల నివారణ వన రక్షణ, ఉపాధి, సంక్షేమం, ఆధునీ కరణకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యల గురించి 2026 ఆగస్టు రెండు నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు రెండు నుండి బయలుదేరిన బస్సు యాత్ర ఆరవ తారీఖున నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ జిల్లాలో కార్మికులు దాదాపు 20,25 వేల కల్లుగీత కార్మికులు కల్లు గీతా వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకవచ్చి మాదాలను నివారించాలని వృత్తిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 రూపాయలు, ఎక్స్గ్రేషియా 10 లక్షలు చెట్ల పెంపకానికి భూమి తదితర డిమాండ్లను పరిష్కారం చేయుటకై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన అన్నారు. మనకోసం పోరాడి అమరులైన కామ్రేడ్ ధర్మ బి క్షం, తోట్ల మల్సూరు, బైరు మల్లయ్య, వర్ధల్లి బుచ్చి రాములు, వేముల నాగయ్య, బాధిని చెన్నయ్య,జినుకుంట్ల లింగయ్య, బొమ్మగాని జానయ్య, కొండ నాగులు, కొండ రాములమ్ లాంటి ఎందరో త్యాగమూర్తులను యాది చేసుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు.

## మేరు సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ బ్యూరో, జులై 19 (వార్తా వేదిక సూర్య )



మేరు సంఘం నల్లగొండ జిల్లా, నగర ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పట్టణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికాగా జిల్లా కమిటీలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోస్టులకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. స్థానిక ఎస్ పి ఆర్ గార్డెన్స్ లో జరిగిన ఎన్నికలలో మేరు సంగం నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా బోనగిరి సురేందర్, ప్రధాన కార్యదర్శి గా గుంటి రామకృష్ణ ఎన్నికయ్యారు. నగర అధ్యక్షులుగా నామ రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. రెండు కమిటీలలో కూడా వీరితోపాటు ఐదుగురు ఉపాధ్యక్షులు అయిదుగురు కార్యదర్శులు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులతో మొత్తం 21 మంది కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉత్తమ కులానికి ప్రత్యేక గుర్తింపునిచ్చిందని, ఈ కార్పొరేషన్ ద్వారా అందే సంక్షేమ ఫలాలు, రుణాలను అట్టడుగు వర్గాల వారికి అందించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా గుంటీ మల్లిఖార్జున్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలి

### కత్తుల లింగస్వామి జిల్లా అధ్యక్షులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నల్లగొండ, వార్త వేదిక సూర్య

ఏపూర్ గ్రామంలో ఉన్న ఎస్సీ కాలనీ వాసులకు కమ్యూనిటీ హాల్ ను మంజూరు చేసి నిర్మాణ పనులను చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు కత్తుల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దళితవాడల సర్వే కార్యక్రమంలో భాగంగా ఏపూర్, సుంకనపల్లి గ్రామాలల్లో సంఘం ఆధ్వర్యంలో సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించే మాట్లాడుతూ ఏపూర్ గ్రామంలో మెజార్టీగా ఉన్న ఎస్సీ కాలనీ వాసులకు కమ్యూనిటీ హాల్ కోసం గత పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో దళితులకు కొద్దిమందికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని, అర్హత ఉన్న ఇల్లు మంజూరు కావడంలేదని స్థానిక ప్రభుత్వ అధికారులు వెంటనే సర్వే చేసి అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కాలనీలలో చివరి బజారు పైభాగం నుండి క్రింది వరకు సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని అదేవిధంగా డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సుంకనపల్లి గ్రామంలో ఎస్సీ (మాల, మాదిగ) కమ్యూనిటీ




వాళ్లకు ఏడు ఇందిరమ్మ ఇండ్లు మాత్రమే మంజూరు చేశారని, చాలామంది దరఖాస్తులు పెట్టుకున్న రెండో విడతలో వస్తాయని అధికారులు చెప్తున్నారని స్థానిక శాసనసభ్యులు స్పందించి ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలలో మురికి కాలువబ నిర్మాణాలు చేపట్టాలని వీధి దీపాలు సక్రమంగా వచ్చేటట్లు చూడాలని అర్హులైన వారందరికీ అన్ని రకాల పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చిట్యాల మండల సహాయ కార్యదర్శి ఎరసాని పరమేష్ నాయకులు ఎరసాని రాములు, మహేష్, రమేష్, శంకర్, శ్రీను, మల్లయ్య, నరసింహ, లింగయ్య, రామ స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతదే పార్టీ భవిష్యత్తు





### ప్రజా సమస్యలపై గళమెత్తాలి : ఆల వెంకటేశ్వర్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్తా వేదిక సూర్య):

భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆల ప్రీతి రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, యువజన విభాగం బలోపేతం, గ్రామాల వారీగా పార్టీ విస్తరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేస్తూ ప్రజల సమస్యలపై పోరాడాలని, ప్రజల్లో నిత్యం ఉంటే రాజకీయ భవిష్యత్తు యువతదేనని భరోసా ఇచ్చారు.

పార్టీ నూతన కమిటీల్లో యువతకు ప్రాధాన్యత కల్పిస్తామని, సంస్థాగత నిర్మాణంలో భాగంగా యువ నాయకులకు కీలక బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన



ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం యువత డిక్లరేషన్, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని యువతకు పిలుపునిచ్చారు.

ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తుందని, పార్టీ అధినేత కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసే లక్ష్యంతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు.



## మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ని కలిసిన కర్నాటి వెంకటేశం వజ్రమ్మ

గట్టుప్పల.వార్త వేదిక సూర్య:

గట్టుప్పల చేనేత సహకార సంఘం ఎన్నికల్లో గెలుపొంది అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన కర్నాటి వజ్రమ్మ వెంకటేశం హైదరాబాద్ లోని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## గందోత్సవం లో పాల్గొన్న ఎస్ఐ పవన్ కుమార్...

కొల్లాపూర్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :

కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గము పెంట్ల వెల్లి మండలం జటపోలు గ్రామం లో శనివారం రోజు జరిగిన జటపోలు 396 పెద్ద దర్గా ఉర్సు హజరత్ సయ్యద్ షా దుర్వేశ్ అలీ ఖాద్రి శ్రీ మదన గోపాల స్వామి గందోత్సవం లో పెంట్లవెల్లి మండల పోలీస్ ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఎస్సై పవన్ కుమార్ ఉర్సు మహోత్సవము నకు సంబంధించి దర్గా కు దట్టీలను తల పై ఎత్తుకొని సమర్పించారు. గందోత్సవం లో పాల్గొనడానికి వచ్చిన ఎస్సై పవన్ కుమార్ తో పాటు మిగతా పోలీస్ అధికారులకు ఉర్సు నిర్వహకులు శాలువాలు కప్పి సన్మానించారు.

## రూ.50 వేల సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్‌కు ఎస్పీ అభినందనలు...

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్త వేదిక సూర్య ):




ఆటోలో ప్రయాణించిన వ్యక్తి మరిచిపోయిన సుమారు రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్‌ను నిజాయితీగా పోలీసుల ద్వారా యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్‌ను జిల్లా ఎస్పీ డి. జానకి, అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వెంకట్ రాజు ఆటోలో ప్రయాణించే సమయంలో సెల్‌ఫోన్ జారి సీటు పక్కనున్న సందులో పడిపోయింది. అనంతరం ఆటోను శుభ్రం చేస్తుండగా ఫోన్ కనిపించడంతో అబ్దుల్ హఫీజ్ దానిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సెల్‌ఫోన్‌ను యజమానికి అందజేయగా, ఆటో డ్రైవర్ నిజాయితీని కొనియాడుతూ శాలువాతో సత్కరించారు. సమాజంలో ఇటువంటి నిజాయితీ గల వ్యక్తులు ఆదర్శంగా నిలుస్తారని ఎస్పీ పేర్కొన్నారు.

## తెలంగాణలో కొత్త నియోజకవర్గాలు..?

### జోగులాంబ గద్వాల జిల్లాలో 'అయిజ'కు అవకాశం..!

### మహబూబ్ నగర్ జిల్లాలో కూడా!

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్త వేదిక సూర్య):




తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్త నియోజకవర్గాలు ఏర్పడే అవకాశాలపై చర్చ సాగుతోంది. అధికారిక ప్రకటన వెలువడకపోయినా, రాజకీయ వర్గాల్లో దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

ప్రస్తుతం తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలు ఉండగా, రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం భవిష్యత్తులో వాటి సంఖ్య 179కు పెరిగే అవకాశం ఉంది. అలాగే లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెరిగే అవకాశముంది. అయితే, దీనికి కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియ చేపట్టి అధికారికంగా అమలు చేయాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో జోగులాంబ గద్వాల జిల్లాలో "అయిజ "కేంద్రంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వడ్డేపల్లి, రాజోలి, అయిజ, గట్టు మండలాలతో పాటు మరో కొత్త మండలాన్ని కలుపుతూ ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశముందని సమాచారం.

అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల నియోజకవర్గం పరిధిలో కూడా మరో కొత్త నియోజకవర్గం ఏర్పడే అవకాశాలపై చర్చ నడుస్తోంది.

ప్రస్తుతం ఇవి అధికారికంగా ప్రకటించిన నిర్ణయాలు కావు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టి ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన తర్వాతే కొత్త నియోజకవర్గాల ఏర్పాటు ఖరారవుతుంది.



## ప్రైవేట్ జూనియర్ కళాశాలపై ఆకస్మిక తనిఖీ

నాగర్ కర్నూల్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :
నాగర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటలో న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో నోడల్ ఆఫీసర్ జి.వెంకటరమణ తనిఖీలు కళాశాల ప్రాంగణంలో పాఠ్యపుస్తకాల విక్రయాలు గుర్తించిన అధికారులు పుస్తకాల నిల్వ గదిని సీజ్ చేసిన తదుపరి చర్యలు ప్రారంభం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయొద్దని నిబంధనలు అతిక్రమిస్తే బోర్డు నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను సహించబోమన్న అధికారులు.ప్రైవేట్ జూనియర్ కళాశాలలు పారదర్శకంగా వ్యవహరించాలని కళాశాల యాజమాన్యాలకు నోడల్ ఆఫీసర్ జి.వెంకటరమణ తెలియజేశారు.

## బొడ్రాయి, బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి...

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్త వేదిక సూర్య):



జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావి గడ్డలో నిర్వహించిన బొడ్రాయి, బోనాల పండుగ వేడుకల్లో మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

అనంతరం నిమ్మబావి గడ్డ ప్రజలకు బోనాల పండుగ శు భాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

## గిన్నిస్ బుక్లో స్థానం

కొల్లాపూర్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :



కూచిపూడి నృత్య ప్రదర్శన ద్వారా గిన్నిస్ బుక్లో స్థానం సంపాదించుకున్న సింగోటం గ్రామానికి చెందిన శృతిని సాహితీ కళావేదిక అధ్యక్షుడు శంకర్ గౌడ్ సన్మానించారు. తండ్రి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు ఆయన కృషితో కూతురు విద్యతో పాటుగా కలలో రాణించారు. శృతి తల్లిదండ్రులకు పుట్టిన ఊరికి మంచి పేరు ప్రతిష్ఠలు తేవడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు

## 5 రోజులుగా కనిపించని వృద్ధుడు .. కుటుంబ సభ్యుల ఆందోళన

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్తా వేదిక సూర్య):



నవాబ్‌పేట్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మాడుగు పెంటయ్య (62) గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయారు. ఈ నెల 15న ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, సమీప గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన భార్య మాడుగు యాదమ్మ నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వి. నరేందర్ తెలిపారు. పెంటయ్య ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని నవాబుపేట ఎస్సై తెలిపారు.

## చిన్నారెడ్డికి కీలక బాధ్యతలు..

### హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి..

కొల్లాపూర్, జూలై 19 (వార్తా వేదిక సూర్య):



ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేసిన రాష్ట్ర ఉన్నత స్థాయి కమిటీకి ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నారెడ్డిని నియమించడం హర్షణీయమని కొల్లాపూర్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ కమిటీ కీలకంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన ప్రణాళికతో సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

# పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి




నాగర్‌కర్నూల్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ల నిరంజన్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ
పార్లమెంటు, రాజ్యసభ, మరియు అసెంబ్లీ స్థానాల పెంపు కంటే ముందుగా బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తరువాతే పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆయన ఇంకా ఈ క్రింది డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని.దేశ జనాభా గణనలో బీసీ కులాల సామాజిక, ఆర్థిక కుల గణన చేపట్టాలి. మరియు బీసీ ఉద్యోగుల నియామకాలలో అమలవుతున్న క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలి. బీసీలపై జరిగే వివక్ష, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక బీసీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలి. ఈ బ్లూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలి. అడవుల్లోని మృగాలు, పశుపక్షుల జనాభా వివరాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ, దేశ సంపద సృష్టిలో, ఉత్పత్తి రంగంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీల జనాభా గణనను ఇప్పటికీ నిర్వహించకపోవడం సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకుండా, పాలనలో భాగస్వామ్యం కల్పించకుండా, నిర్ణయాధికారంలో బీసీలకు తగిన స్థానం ఇవ్వకుండా భారతదేశాన్ని సంపూర్ణ ప్రజాస్వామ్య దేశంగా ఎలా చెప్పగలరని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, బీసీ రైతు సంఘం అధ్యక్షులు నిరంజన్ యాదవ్, జిల్లా నాయకులు గొడుగు రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సిహెచ్ రేణుక, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, యువసేన అధ్యక్షులు నేష లక్ష్మయ్య, ఆటో యూనియన్ నాయకులు మౌలానా పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం బిఎఫ్ఎస్ఐ అదనపు సెక్షన్ విద్యార్థులకు సువర్ణావకాశం

### కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.గీతాంజలి

నాగర్ కర్నూల్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :
నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ ఆర్ట్స్ మరియు కామర్స్ డిగ్రీ కళాశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గుర్తింపు పొందిన కళాశాల మరో ప్రతిష్టాత్మక మైలురాయిని అందుకుంది. ప్రస్తుత విద్యా సంవత్సరం (2026-27) కి గాను కళాశాలలో ప్రవేశపెట్టిన బీకాం,బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, కోర్సుకు విద్యార్థుల నుండి ఊహించని రీతిలో భారీ స్పందన లభించింది. ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరగడంతో, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వ కళాశాల విద్య కమిషనరేట్ సిసిఈ ఆదేశాల మేరకు ఈ కోర్సులో అదనంగా మరో సెక్షన్‌ను మంజూరు చేశారు.బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ,కోర్సు ప్రత్యేకతలు ఒ ఉపాధి అవకాశాలు

ప్రస్తుత కార్పొరేట్ రంగంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ విభాగాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ కోర్సును రూపొందించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు లభించే ప్రయోజనాలు నేరుగా ఉద్యోగ అవకాశాలు బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, నా బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీస్ మరియు వివిధ కార్పొరేట్ ఫైనాన్స్ సంస్థలు నైపుణ్యం కలిగిన గ్రాడ్యుయేట్లను నేరుగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపిక చేసుకుంటున్నాయి.ప్రాక్టికల్ శిక్షణ కేవలం థియరీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్ రికార్డులు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, ఇన్సూరెన్స్ విధానాలు మరియు డిజిటల్ పేమెంట్స్ వంటి ఆధునిక అంశాలపై పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. చదువుతో పాటు సంపాదన విద్యార్థులు చదువుకుంటూనే ప్రముఖ సంస్థలలో అప్రెంటిస్‌షిప్ ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని సంపాదించడంతో పాటు ప్రతి నెల స్టైఫండ్ పొందే అద్భుత అవకాశం ఉంది.

అదనపు సర్టిఫికేషన్ల

కోర్సులో భాగంగానే విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను పెంచే, ఎన్ఐఎస్ఎం, ఐఆర్డిఏ టాలీ,వంటి విలువైన అంతర్జాతీయ ప్రమాణాలు గల సర్టిఫికేషన్ కోర్సులను కూడా అందిస్తున్నారు.తక్కువ పోటీ ఎక్కువ డిమాండ్

ప్రస్తుతం మార్కెట్లో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, రంగంలో నిపుణుల కొరత ఎక్కువగా ఉండటం,



సాంప్రదాయ కోర్సులతో పోలిస్తే ఇందులో పోటీ తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులు త్వరగా స్థిరపడవచ్చు.

నాణ్యమైన విద్యే లక్ష్యంగా అదనపు సెక్షన్

విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ బోధనా నాణ్యత తగ్గకుండా చూసేందుకు, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించేందుకు వీలుగా ఈ కొత్త సెక్షన్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా విద్యార్థులందరికీ విశాలమైన తరగతి గదులు, డిజిటల్ ల్యాబ్స్, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం మరియు అధునాతన శిక్షణా సౌకర్యాలు సమకూరనున్నాయి.

బిఎఫ్ఎస్ ఐ రంగంలో అద్భుతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలనుకునే ఈ ప్రాంత విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.గీతాంజలి తెలియజేశారు.ప్రభుత్వం అదనపు సెక్షన్‌ను మంజూరు చేయడం చాలా సంతోషకరం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కార్పొరేట్ స్థాయి ఉద్యోగాలను సాధించేందుకు ఈ కోర్సు ఎంతో దోహదపడుతుంది. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని

ప్రవేశాల కొరకు సంప్రదించండి

ఈ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు పూర్తి వివరాల కొరకు నేరుగా నాగర్ కర్నూలు ప్రభుత్వ ఆర్ట్స్ మరియు కామర్స్ డిగ్రీ కళాశాలను సందర్శించవచ్చు.

మరింత సమాచారం కొరకు 8341490263 హెల్ప్‌లైన్ నంబర్ సంప్రదించాలని కోరారు.

# బిజినపల్లి మండలంలో నకిలీ డీఏపీ వినియోగం

వనపర్తి జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :
మహదేవునిపేటలో 111 బస్తాల నకిలీ డీఏపీ స్వాధీనం, సంఘటన స్థలాన్ని జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఐపీఎస్. నాగర్‌కర్నూలు జిల్లా బిజినపల్లి మండలంలోని మహదేవునిపేట గ్రామంలో నకిలీ డీఏపీ ఎరువులను రైతులు వినియోగించడం వ్యవసాయ అధికారులు గుర్తించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ నకిలీ డిఏపీని పరిశీలించిన జిల్లా ఎస్పీ మరియు కలెక్టర్. రైతులకు తక్కువ ధరకు నకిలీ డీఏపీ ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించి మోసానికి పాల్పడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామానికి చెందిన ఏడుగురు రైతుల ఇళ్లలో నిల్వ ఉంచిన మొత్తం 111 బస్తాల అనుమానాస్పద డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇప్పటికే పంట పొలాల్లో వినియోగించిన 39 డీఏపీ ఖాళీ సంచులను కూడా అధికారులు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తులో భాగంగా భద్రపరిచారు.

ఈ స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాలను పరిశీలించి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు రైతుల చేతికి ఎలా చేరాయి, ఏ మార్గంలో సరఫరా జరిగిందనే అంశాలపై అధికారులతో చర్చించారు.

మహదేవునిపేట గ్రామానికి చెందిన పొలిముని రాజు, నందిపేట బాలయ్య, దుగ్గని రాములు, బత్తుల రాములు, ఏ. ప్రవీణ్ కుమార్ రెడ్డి, జక్కా మన్యపు రెడ్డి, ఏ. జైపాల్ రెడ్డి అనే రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు రూ.1600 /1700 వందల రూపాయలకు ఒక బస్తా చొప్పున విక్రయించడంతో వారి వద్ద నుంచి ఈ డీఏపీ ఎరువులను కొనుగోలు చేసినట్లు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

ఈ స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాల నుంచి నమూనాలను సేకరించి వెంటనే హైదరాబాద్ లోని గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా నివేదికలు అందిన వెంటనే చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. నకిలీ ఎరువులుగా నిర్ధారణ అయితే బాధ్యులపై ఎరువుల నియంత్రణ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.స్వాధీనం చేసుకున్న నకిలీ డిఏపి ఎరువులను బిజినపల్లి రైతు వేదికలో భద్రపరచాలని కలెక్టర్ వ్యవసాయ అధికారుల ఆదేశించారు.

అదేవిధంగా ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జిల్లా పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు.నకిలీ ఎరువుల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, ఏ ప్రాంతం నుంచి వాటిని తీసుకొచ్చారు, జిల్లాలో మరెక్కడైనా ఇలాంటి ఎరువులు



విక్రయించారా అనే అంశాలను పూర్తిగా విచారించి సమగ్ర నివేదిక సమర్పించాలని, అవసరమైతే ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్ర అధికారులతో కూడా సమన్వయం చేసుకుని దర్యాప్తు చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ గారు మాట్లాడుతూ రైతులను మోసం చేసే నకిలీ ఎరువుల వ్యాపారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జిల్లా రైతులకు పలు సూచనలు చేశారు.ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువకు విక్రయిస్తున్నారని నమ్మి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని రైతులను కోరారు.నకిలీ ఎరువుల వినియోగం వల్ల పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో పాటు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో నకిలీ ఎరువుల విక్రయాల పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై నిరంతరం తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాసులు,సిఐ అశోక్ రెడ్డి, బిజినపల్లి డిటి రవికుమార్, ఎస్ఐ షంషద్దీన్,ఇతర పోలీసు అధికారులు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



## మహబూబ్‌నగర్ నాగర్‌కర్నూల్



## ప్రతి ఇంటికి వెళ్లి సర్ ప్రక్రియ పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి...

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 19 (వార్త వేదిక సూర్య):
మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నగర కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లోని ప్రతి ఇంటిని సందర్శించి సర్ ఫారాల నింపుదలలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ఓటర్లలో అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమని, నిర్లక్ష్యం వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రతి ఇంటిని సందర్శించి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్లతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశం

నాగర్ కర్నూల్ జులై 19 ( వార్తా వేదిక సూర్య ) :



మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నగర మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కార్పొరేటర్లతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు నింపడంలో ప్రజలకు సహకరించాలని, ఓటర్లలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉన్నందున, ఒక్క ఓటరు కూడా ఓటు కోల్పోకుండా ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముడా చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వహక అధ్యక్షుడు అజ్మత్ అలీతో పాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## తాండ లో బాలుడు అదృశ్యం..

వనపర్తి, జులై 19 (వార్తా వేదిక సూర్య):
వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. పుణ్యానాయక్ తాండకు చెందిన అంగోతు ప్రవీణ్ నాయక్ (14) శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. సమయం గడుస్తున్నా బాలుడు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ బాలుడి ఆచూకీ లభించలేదు.

దీంతో బాలుడి తల్లి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై హృషికేష్ తెలిపారు. బాలుడి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌ను లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సమాజ హితమే సాంస్కృతిక సంస్థల లక్ష్యం

### జ్ఞాన వికాస భారతి మాసాంతపు సమావేశం

నాగర్ కర్నూల్ జులై 19 (వార్తా వేదిక సూర్య ):



నాగర్ కర్నూల్ జిల్లాలో జ్ఞాన వికాస భారతి మాసాంతపు సమావేశంలో ముఖ్యఅతిథిగా సంస్థ ఫౌండర్ బ్రహ్మచారి స్వగృహంలోనే పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఫౌండర్ బ్రహ్మచారి మాట్లాడుతూ సంస్కృతిక కార్యక్రమాలు సమాజ హితము కోరుతూ ఈ సహ్రాస్రం బడి గుడులకు సాంస్కృతిక కార్యక్రామాల ద్వారా సహాయం చేసే దిశగా కృషి చేయాలని కోరారు. సాంస్కృతిక శాఖ ప్రెసిడెంట్ సంజీవ గౌడ్ అధ్యక్షతన పలు తీర్మానములు ఆమోదించనైనది. సాంస్కృతిక కార్యక్రమాలు తోపాటు సామాజిక సేవ పరమైన కార్యక్రమాలు చేయుటకు ప్రధాన కార్యదర్శి మర్యాద వెంకటయ్య ప్రస్తవించగా సభ్యులందరు ఏకగ్రీవంగా ఆమోదించ నైనది 20 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కు సివిల్ డ్రెస్సెస్, మెరిట్ స్కాలర్షిప్స్, నోట్ పుస్తకలు ఇచ్చుటకు తీర్మానించగా స్పందించిన సభ్యులు అమరేందర్, డాక్టర్ ధర్మేందర్ స్వగ్రామమైన అనంతరం యుపిఎస్ లో ప్రతి సంవత్సరం లాగానే ఇదఫా కూడా ఇరవై మంది కి మెరిట్ స్కాలర్షిప్స్ ఇచ్చుటకు ముందుకు వచ్చినందుకు మరియు తిరుమలగిరి డిండి లో పాఠశాలల్లో తన సోంత ఖర్చులతో పుస్తకాలు ఇప్పిస్తున్న బేబీ హాస్నిక పేరెంట్స్ మాధవి ప్రకాష్ కు జడ్చర్లలో అనాథపిల్లలకి బట్టలు కుట్టిస్తున్న అమ్రాబాద్ శ్రీనివాసులు, ఉదయ్ కుమార్ కి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానించనైనది కార్యక్రమములో పాల్గొనిన గౌరవ సభ్యులు కరుణాకర్ రెడ్డి రమేశ్వరచారి సారంగా శ్రీనివాసులు సునందనాచారి కొండయ్య మల్లా చారి సుధారాణి బ్రహ్మచారి పాల్గొన్నారు కాగా సునందనాచారి మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలకి అమలుకు ముందుకు వచ్చిన హైదరాబాద్ శాఖా శైలజ రమేశ్ జోషి చంద్రకళ శంకర్ గౌడ్ శ్రీజ దినకర్ మహబూబ్ నగర్ శాఖా మల్లేష్ టిపి జయ మరియు గుండ్లపల్లి డిండి శాఖ కన్వీనర్ గౌతమ్ సభ్యుల కు ధన్యవాదాలు తెలుపుతూ వందన సమర్పణ చేశారు.

# మినీ ట్యాంక్ బండ్ రోడ్డు పనులను నాణ్యతాయుతంగా చేయాలి

**- మినీ ట్యాంక్ బండ్ రోడ్డు మరమ్మతుల పనులను పరిశీలించిన తుంగతుర్తి శాసనసభ్యులు సామేల్.**



మోత్కూరు, జూలై 19( వార్త వేదిక సూర్య): మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మినీ ట్యాంక్ బండ్ (చెరువు కట్ట) రోడ్డు పనులను నాణ్యతగా పాటించాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. మీ ట్యాంక్ బండ్ (. చెరువు కట్ట) రోడ్డుకు జరుగుతున్న మరమ్మత్తుల పనులను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఐ.బి.శాఖకు చెందిన వర్క్ ఇన్స్పెక్టర్ గాని ,ఏఈ లలో ఒక్కరూ కూడా అక్కడ లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఈ తో ఫోన్ లో మాట్లాడుతూ పనులు అయిపోయేదాకా నిరంతరంగా ఇక్కడ ఉండాలని, అధికారుల పర్యవేక్షణ తోనే పనులు జరగాలని సూచించారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ అధికారులు చెంతనే ఉండి పనులు చేయించినప్పుడే నాణ్యతయుతంగా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. గత చెరువు కట్టకు దీటుగా పనులన్నీ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**పార్టీ బి ఎల్ ఏ లు 30 నాటికి పూర్తి చేయించాలి.**

ప్రభుత్వం చేపట్టిన సర్ ప్రక్రియ పూర్తికి తేదీని ఆగస్టు3 నాటికి పెంచిందని, కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు చెంత ఉండి, ప్రతి ఇంటికి వెళ్లి నమోదు ప్రక్రియను ఈనెల 30 నాటికి పూర్తి చేసి, ఫారాలను బిఎల్ఓ లకు అందజేసే పనిని పూర్తి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. ఆదివారం మినీ ట్యాంక్ బండ్ రోడ్డు పనులను పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ బి ఎల్ ఏ లు ఈ కొద్ది రోజులు కష్టపడి ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. నిజానికి పేదలు, పనుల కోసం, ఉపాధి కోసం వలస పోయేవారు ఎక్కువమంది ఉంటారని, స్థానికంగా లేకపోవడం వల్ల వాళ్లను రప్పించి ఈ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో పేదలు ఎంతోమంది ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉంటుందని తెలిపారు .మండలాల, గ్రామాల్లోని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ,మాజీ ప్రతినిధులు, ప్రస్తుత నాయకులు ఈ కొద్ది రోజులు ఎంతో శ్రద్ధ చూపి ఈ సర్ ప్రక్రియను పూర్తి చేయించే బాధ్యత ను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. తమ పార్టీ నేత రాహుల్ గాంధీ జూమ్ మీటింగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి తదితరులతో జూమ్ లో మాట్లాడారని, తాను కూడా జూమ్ మీటింగ్ పాల్గొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సర్ ప్రక్రియను ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని పార్టీని ఆదేశించారని, తమ నేత ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త ,ప్రతి నాయకుడు ఎంతో శ్రద్ధతో ఈ పనిని 100% పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని పార్టీ బి ఎల్ ఏ లు ఏలాంటి ఇబ్బందులు ఉన్న నియోజకవర్గ ఇంచార్జీ పానుగంటి నర్సింహ్మారెడ్డిని సంప్రదించాలని,తనతో నేరుగా మాట్లాడాలని ఆయన సూచించారు తుంగతుర్తి నియోజకవర్గంలో 2.63 లక్షల ఓట్లు ఉన్నాయని ఇందులో చనిపోయిన వారు ఓట్లు తొలగిస్తారని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఓటరు నమోదై ఉండాలని,ఏ ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ చూసుకోవాలన్నారు.100 మంది బిఎల్ఏ లతో రాహుల్ గాంధీ పరిశీలన చేస్తున్నారని, బాగా పనిచేసే, సమర్థవంతంగా తమ కర్తవ్యాన్ని నిర్వహించే బిఎల్ఏ ను రాహుల్ గాంధీ గుర్తించే అవకాశం ఉందని, బిఎల్ఏలు బాగా పనిచేసే గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, చేనేత సహకార సంఘం వంగరి రాములు,సోషల్ మీడియా మండల, పట్టణ కన్వీనర్లు బందెల రవి,పాలోజు శేఖరాచారి స్థానిక కాంగ్రెస్ నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీ నర్సింహ్మారెడ్డి, గడ్డం సోమనర్సయ్య ,లింగంపల్లి రఘువర్ధన్ రావు, తదితరులు ఉన్నారు.




## ఎస్ ఐ ఆర్ అంశంపై నిర్వహించిన జూమ్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం



భువనగిరి టౌన్ జూలై 19 వార్త వేదిక సూర్య : ఆదివారం ఎస్ ఐ ఆర్ అంశం పై నిర్వహించిన జూమ్ సమావేశంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ హాజరై పార్టీ నాయకులకు కీలక దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరింత అప్రమత్తంగా. జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. బిఎల్ఏ లు బూత్ లెవెల్ ఏజెంట్స్ ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించి, ప్రతి అర్హత కలిగిన ఓటరికి న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు, అసెంబ్లీ ఈఆర్ఓ కోఆర్డినేటర్లు పాల్గొని ఎస్ ఐ ఆర్ అంశంపై పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు, భవిష్యత్ వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

## జనంపల్లి పద్మశాలి సంఘం, అధ్యక్షుడుకి శుభాకాంక్షలు తెలియ చేసిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం



రామన్నపేట జులై 19 ( వార్త వేదిక సూర్య ) రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వనం శ్రీనివాస్ ని, స్కిల్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సంగిశెట్టి సుదర్శన్ని, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం సభ్యులందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పద్మశాలి సోదరుల సంక్షేమానికి, వారి వృత్తిపరమైన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. నూతన అధ్యక్షులకు వారి బాధ్యతల్లో అన్ని విధాలా విజయాలు చేకూరాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ పూర్వ అధ్యక్షులు నల్లబెల్లి బలరాంకు ఘన నివాళులు



చౌటుప్పల్ జులై 19 వార్తా వేదిక సూర్య: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు అమరజీవి నల్లబెల్లి బలరాం రెండవ వర్ధంతి ఆదివారం సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బలరాం చిత్రపటానికి సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బండారి నరసింహ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లబెల్లి బలరాం ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ వేల మంది విద్యార్థులను క్రమశిక్షణగా తీర్చిదిద్దుతూ, ఉపాధ్యాయ సమస్యలపై అనేక ఉద్యమాలు చేసి సాధించిన వారు అని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, వారి సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు. టీఎస్ యుటిఎఫ్ ఉమ్మడి నల్గొండ జిల్లాలో విస్తరించడానికి ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. వారి ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, బత్తుల దాసు, గోపగోని లక్ష్మణ్ గౌడ్, ఎండి ఖయ్యూం, పెరియార్, మహమ్మద్ పాషా, నల్లబెల్లి కిషన్, అనిల్, గంట శంకర్ రెడ్డి, మహేష్, డాక్టర్ నల్లబెల్లి దీప్తి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలో పాల్గొన్న పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్

భువనగిరి టౌన్ జూలై 19 ,వార్త వేదిక సూర్య : భువనగిరి పురపాలక సంఘం లో ఆషాడ మాసం బోనాల సందర్భంగా కుమ్మరి కులస్తులతో కలిసి బోనం మైసమ్మకు పోచమ్మకు , నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మకు, బోనం సమర్పించారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గం ప్రజలు అన్ని విధాలుగా అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని పంటలు బాగా పండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆ అమ్మవారు చూసుకోవాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్. వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ కౌన్సిలర్లు,కుల పెద్దలు. స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో చెల్లించి, ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ డిమాండ్**



భువనగిరి మండలం జూలై 19, వార్త వేదిక సూర్య భువనగిరి మండలం బస్వాపురం ఆదివారం ప్రాజెక్ట్ ఆవరణలో నిరసన.ప్రాజెక్ట్ పరిధిలో చెరువులను నింపి రైతాంగానికి సాగునీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బస్వాపురం ప్రాజెక్టులోని నీటిని పరిశీలన చేసిన అనంతరం ప్రాజెక్టు కట్టపైన ఉన్న గేట్ల దగ్గర నీటిని విడుదల చేయాలని " ధర్నా " కార్యక్రమాన్ని నిర్వహించిన ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ జిల్లా అత్యంత కీలకంగా రైతాంగానికి ఉపయోగపడే బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ, బట్టుపల్లి అనురాధ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ , భువనగిరి మండల పార్టీ కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ, కొండ అశోక్, భువనగిరి పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గంధమల్ల మాతయ్య, మండల కమిటీ సభ్యులు మోటె ఎల్లయ్య, కళ్లెం లక్ష్మి నరసయ్య, టౌన్ కమిటీ సభ్యులు బర్ల వెంకటేష్, మండల పరిషత్ మాజీ కో- ఆప్షన్ యండి బాబు, బస్వాపురం మాజీ శాఖ కార్యదర్శి నరాల చంద్రయ్య, శాఖ సహాయ కార్యదర్శి రాసాల దెవెందర్, నమాత్ పల్లి శాఖకార్యదర్శి జిట్ట అంజిరెడ్డి, సీపీఎం సభ్యులు, రైతులు బండి శ్రీను, తెల్జూరి మాణిక్యం, గోదల వెంకట్ రెడ్డి, కోయగూరి రామచంద్ర, రాసాల బాలయ్య, కన్నమోయిన గంగరాజు, మాటూరి కృష్ణ, కొండ పాండు, గంగన్న బోయిన ఐలయ్య, కూకుట్ల రమేష్, ఉడత బాలయ్య, రాసాల చిత్తారి, కదారి మల్లేశం, కొండ శివశంకర్, పసుల నందు, ఎడ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ,చీరలు పంపిణీలో పాల్గొన్న కౌన్సిలర్



భువనగిరి టౌన్ జూలై 19, వార్త వేదిక సూర్య భువనగిరి మున్సిపాలిటీ 27వ వార్డు లో ఇందిరమ్మ,చీరలను భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు 22వ వార్డులో మహిళా సంఘాల సభ్యులకు పంపిణి చేసిన కౌన్సిలర్ ఎండీ బురాన్ ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం లో అన్ని వర్గాల ప్రజలు సంతోషం గా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం మహిళా సంఘాల నాయకురాలు ఆర్పీ. మహిళా సంఘం నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# బోనం సమర్పించిన కుమ్మరి సంఘం నాయకులు



భువనగిరి టౌన్ జూలై 19, వార్త వేదిక సూర్య ఆషాఢమాసం సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో భువనగిరి పురపాలక పోచమ్మవాడలో నల్లపోచమ్మ అమ్మవారికి అలాగే ఇందిరా నగర్ లో కోట మైసమ్మ అమ్మవారికి ఆదివారం తొలి భోనం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల, మాజీ మునిసిపల్ చైర్మన్లు బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు జాలిగం విఘ్నేష్, బర్రె పూజిత, బెండ్ స్వరూప లాల్ రాజ్ మరియు కుమ్మరి సంఘం నాయకులు, తాడూరి బిక్షపతి, నాగరాజు, శేఖర్, శ్రవణ్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు10న కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం**

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య**




రామన్నపేట జూలై 19( వార్త వేదిక సూర్య): కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,కర్షక,కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు.స్థానిక సిపిఎం కార్యాలయంలో సీఐటీ యూ,రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ, నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు.రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో,వ్యవసాయానికి అవసరమైన మద్దతు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు,గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదని వీబీజీరామ్ గా పేరు మార్చి నిర్వీర్యం చేస్తుందని,కూలి రేట్లు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువజనులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు, సహాయ కార్యదర్శి నకిరకంటి రాము, జిల్లా కమిటి సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం,గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు,ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ జిల్లా నాయకులు అప్పం సురేందర్, పల్లె సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వంగాల మారయ్య, నాయకులు ఆవనగంటి నగేష్,నాగటి లక్ష్మణ్,చెన్ను స్వామి,ఉంద్రాతి నర్సింహా,ఆవనగంటి రవి తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన 2500 హామీని తక్షణమే అమలు చేయాలి

**- జిల్లా మహిళసమాఖ్య అధ్యక్షురాలు బండి జంగమ్మ**



మోత్కూరు, జూలై 19 ( వార్త వేదిక సూర్య): 2023 ఎన్నికల ముందు మహిళలకు నెలకు 2500 ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బండి జంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరు మండలం మహిళ సమాఖ్య మహాసభ స్థానిక కేఆర్ భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్పిజి గ్యాస్ సిలిండర్ 500 ఇవ్వాలని, అర్హులైన పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, ఇందిరమ్మ కానుక పథకం కింద తులం బంగారం, మహిళలకు 4000 పెన్షన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మహిళలకు పై జరుగుతున్న అరాచకాలపై ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు.. ఈ మహాసభకు మండల మహిళ సమాఖ్య నాయకురాలు మొగుళ్లస్వాతి అధ్యక్షతన నిర్వహించారు . అనంతరం మహిళ సమాఖ్య మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా జంపాల జయమ్మ, ఉపాధ్యక్షులు మొగుళ్ళ స్వాతి, ప్రధాన కార్యదర్శి తొంట మాధవి, సహాయ కార్యదర్శిగా బుషిపాక రేణుక,కోశాధికారిగా పెండెం మమత, కార్యవర్గ సభ్యులుగా నల్ల పుష్పమ్మ, బోడ ఉపేంద్ర, ఎండి రజియా, మౌలాలి దొండ లక్ష్మి , యానాల సంధ్యారాణి, అన్నెపు ఉమారాణి, బీసు సుగుణ, బోడ లక్ష్మి, గొలుసులో లక్ష్మిలతోపాటు మరికొంతమందిని ఏకగ్రీవంగా. ఎన్నుకున్నారు.

## చేనేత సహకార అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా!



మోత్కూరు, జూలై 19 ( వార్త వేదిక సూర్య): చేనేత సహకార అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో ఇటీవల నేత సహకార సంఘం ఎన్నికల్లో గెలిచిన నూతన పాలకవర్గం ఎమ్మెల్యే సామేల్ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాలతో ఆత్మీయ సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఏలాంటి సమస్యలైనా తమ దృష్టికి తీసుక వస్తె తక్షణమే పరిష్కరిస్తారని చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి రాములు, డైరెక్టర్లు ఏలూరి మత్స్యగిరి రాజారాం, చేనేత నాయకులు మంచె గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నుండి ఉద్యమకారుల ఫోరం అధ్యక్షునికి ఆహ్వానం



వలిగొండ: జులై 19 ( వార్తా వేదిక సూర్య): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నుండి ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామిని సంప్రదింపుల సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఆహ్వానం పంపారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన విధానాలు చర్యలపై సమగ్ర నివేదికను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమంలో వివిధ దశల్లో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులతో కమిటీ సంప్రదింపులు సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా శీలం స్వామిని కమిటీ ఆహ్వానించింది. ఈ ఆహ్వానం వలిగొండ తెలంగాణ ఉద్యమానికి ఎంతో గర్వకారణమని ఆయన అన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 61 || సోమవారం || జులై 20, 2026




## తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు

**శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు, అధికారులు, గ్రామస్తులు**



**యాదాద్రి భువనగిరి జిల్లా /జులై 19/వార్త వేధిక సూర్య :-**

హైదరాబాద్ రవీంద్ర భారతి కళావేదిక లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ వారు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ వారి అర్ ఎస్ కె ఫౌండేషన్ ద్వారా చేస్తున్నటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి 'లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ ' అవార్డు ముఖ్య అతిథి గా విచ్చేసిన ప్రముఖ సినీ నటులు పృథ్వి రాజ్ చేతుల మీదుగా బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మీ లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి అవార్డు లు మాకు భవిష్యత్తు లో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి తొడ్పాటు అందిస్తాయని ఎల్లవేళలా మాకు వెన్నంటి ఉండి నడిపిస్తున్న గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.. ఈ కార్యక్రమం లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డా, పట్నం కమలా మనోహర్ మరియు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో అధిక సాంద్రత విధానంలో అధిక దిగుబడులు

**మోత్కూరు, జూలై 19( వార్త వేదిక సూర్య):**

పత్తి ప్రధాన వాణిజ్య పంట. ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 45--50 లక్షల ఎకరాలలో పత్తి సాగు జరుగుతోంది. పత్తి సాగుకు లోతైన, అధిక నీటి నిల్వ సామర్థ్యం కల్గిన నల్ల నేలలు అత్యంత అనుకూలమైనవి. అయినప్పటికీ, రాష్ట్రంలో తేలికపాటి ఎర్ర నేలలు, మధ్యస్థ నేలలలో కూడా పత్తి విస్తృతంగా సాగు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు, కూలీల కొరత, సాగు వ్యయాల పెరుగుదల, గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఉధృతి, అధిక శాఖీయ పెరుగుదల వంటి కారణాల వల్ల పత్తి దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడంలేదు. ఈ పరిస్థితులను అధిగమించి, ప్రధానంగా తేలికపాటి మధ్యస్థ నేలల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అధిక సాంద్రత పత్తి సాగు విధానం (హెచ్.డి.పి.ఎస్)ను శాస్త్రవేత్తలు రైతులకు పరిచయం చేసింది. ఈ విధానంలో సాధారణ పద్ధతితో పోలిస్తే ఎకరాకు మొక్కల సంఖ్యను పెంచి, మొక్కల ఎదుగుదలను నియంత్రించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

**అధిక సాంద్రత పత్తి సాగు అంటే.....?**

అధిక సాంద్రత పత్తి సాగు (హెచ్.డి.పి.ఎస్) అనేది ఒకే విస్తీర్ణంలో సాధారణ పద్ధతితో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో మొక్కలను నాటి, వాటి శాఖీయ పెరుగుదలను నియంత్రించి, అధిక సంఖ్యలో కాయలు ఏర్పడేలా చేసే శాస్త్రీయ సాగు విధానం.

ఈ విధానంలో మొక్కలు త్వరగా పూత, కాయల దశలోకి ప్రవేశించి, పంట సమానంగా ఎదుగుతుంది. ఫలితంగా పంట త్వరగా పరిపక్వానికి చేరుకొని, తక్కువ వ్యవధిలోనే అధిక దిగుబడులు, మెరుగైన నాణ్యత గల పత్తిని పొందే అవకాశం ఉంటుంది. ప్రధానంగా తేలికపాటి మరియు మధ్యస్థ నేలల్లో ఈ పద్ధతి ద్వారా సాధారణ సాగుతో పోలిస్తే మెరుగైన ఉత్పాదకతను సాధించవచ్చు.

**హెచ్.డి.పి.ఎస్ కు అనువైన హైబ్రిడ్లు :**

హెచ్.డి.పి.ఎస్ లో తక్కువ శాఖీయ పెరుగుదల, త్వరగా పరిపక్వత, సమకాలీన కాయల ఏర్పాట్లు, అధిక పీచు నాణ్యత, మంచి కాయల తెరుచుకునే లక్షణాలు కలిగిన హైబ్రిడ్లను మాత్రమే ఎంపిక చేయాలి. ప్రో. జయశంకర్ తెలంగాణ అగ్రి యూనివర్సిటీ పరిశీలనల్లో ఎన్.సి.ఎస్-2778 బి.టి2 (అర్మిత), ఎన్.సి.ఎస్-7788 బి.టి2 (విన్నర్), ఎన్.సి.ఎస్-927 బి.టి2 (సిరి) వంటి హైబ్రిడ్లు మంచి ఫలితాలు చూపాయి.

**సిఫార్సు చేసిన మొక్కల సాంద్రత:**

90 ఐ 15 సెం.మీ విత్తన దూరంలో 29,040 మొక్కలు/ఎకరా, 90 ఐ 20 సెం.మీ విత్తన దూరంలో 22,338 మొక్కలు/ఎకరా, 90 ఐ 22.5 సెం.మీ విత్తన దూరంలో 19,360 మొక్కలు/ఎకరా, ఈ విధానం ద్వారా పైన తెలిపిన మొక్కల సాంద్రత ఉంటుంది.

**మొక్కల ఎదుగుదల నియంత్రణ:**

అధిక సాంద్రత పత్తి సాగులో మొక్కల మధ్య దూరం తక్కువగా ఉండటం వల్ల మొక్కల మధ్య కాంతి, పోషకాలు, నీటి కోసం పోటీ ఎక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిలో మొక్కలు అధిక శాఖలు, ఆకులు పెంచి ఏపుగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల పెరుగుదల నియంత్రణ అత్యంత ముఖ్యమైన యాజమాన్య ప్రక్రియ. అధిక వర్షాల వలన మొక్క శాఖీయ పెరుగుదల ఎక్కువ ఉన్నచో చమత్కార్(మెపిక్వాట్ క్లోరైడ్ 5%ూూ) ను విత్తిన 45 రోజుల తరువాత 1.0మీ.లి/లీటర్, విత్తిన 65 రోజుల తరువాత 1.5 మీ.లి/లీటర్, తప్పని పరిస్థితుల్లో విత్తిన 85 రోజుల తర్వాత పంట శాఖీయ పెరుగుదల ఎక్కువ ఉంటే 1.5మీ.లి/లీటర్ ఉపయోగించాలి. తద్వారా శాఖీయ పెరుగుదల తగ్గి, పూత, కాయల వృద్ధికి అనుకూలంగా మారి అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంది.

**హెచ్.డి.పి.ఎస్ ప్రయోజనాలు:**

హెచ్.డి.పి.ఎస్ విధానంలో పత్తి సాగు వల్ల ఎకరాకు మొక్కల సంఖ్య ఎక్కువ ఉండడం వలన కలుపు సమస్య తగ్గడంతో పాటు భూమి, నీరు, ఎరువులు వంటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. మొక్కల ఎత్తు నియం త్రణలో ఉండడం వలన, గాలివానల కారణంగా పంట పడిపోవడం కూడా తగ్గుతుంది. ఈ విధానంలో పంట త్వరగా పరిపక్వతకు చేరుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. ఈ విధానంలో పంట కాలం డిసెంబర్ మొదట్లోనే పూర్తి అవుతునందున గులాబీ రంగు పురుగు (పి.బి. డబ్ల్యూ)ఉధృతిని అరికట్టవచ్చు, ఒకేసారి పత్తి పరిపక్వతకు రావడం వల్ల యాంత్రిక కోతకు అనుకూలంగా ఉంటుంది. ఫలితంగా సాగు వ్యయం తగ్గి, రైతులకు అధిక నికర ఆదాయం లభించే అవకాశాలు పెరుగుతాయి.



### రైతులు పత్తి వైపు మొగ్గు చూపాలి

**- ముప్పిడి అశోక్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి**



పెరుగుతున్న సాగు వ్యయాలు, కూలీల కొరత వంటి సవాళ్ల నేపథ్యంలో అధిక సాంద్రత కత్తి సాగు విధానం ( హెచ్. డి. పి .ఎస్.) పత్తి సాగులో ఒక శాస్త్రీయ లాభదాకమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తోంది. ఈ విధానంలో భూమి, నీరు, ఎరువులను సమర్థవం తంగా వినియోగించి, తక్కువ కాలంలో అధిక దిగుబడిని సాధించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఆశించిన ఫలితాలు పొందాలంటే సిఫార్సు చేసిన హైబ్రిడ్ మొక్కల సాంద్రత సమ తుల్ పోషక యాజమాన్యం మొక్కల ఎదుగుదల నియంత్రణ సమగ్ర చీడపీడన నిర్వహణ సరైన సమయంలో ఉపయోగించుకోవాలి.

# ఫోక్సో కేసులో నిందితుడుకి రిమాండ్

**అడ్డగూడూర్ జులై 19(వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బాలెంల చైతన్య 10/7/ 2026 నాడు అడ్డగూడూరులో ఓ మహిళ తన మనవరాలు పై అతను ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడని, అలాగే 8/7/2026 సాయంత్రం నాడు తన ఇంట్లోకి గోడ దూకి వచ్చి తన మనవరాలతో అసభ్యకరంగా ప్రవర్తించాడనీ ఫిర్యాదు చేయగా అడ్డగూడూరు పోలీస్ స్టేషన్లో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఇ కేసులో బాధితురాలి (మైనర్ బాలిక) యొక్క వాంగ్మూలం తేదీ 13/7/2026 నాడు రికార్డ్ చేయగా, సదరు చైతన్య రేప్ చేశాడని చెప్పగా వెంటనే కేసులోని సెక్షన్లను మారుస్తూ కోర్టుకి పంపే లోగా అదే రోజు అర్ధరాత్రి చైతన్య అట్టి మైనర్ బాలికను (మలక్పేటలోని బాలిక పిన్ని ఇంటి వద్ద నుండి) తీసుకొని వెళ్ళగా మలక్ పేట పోలీస్ స్టేషన్ నందు కిడ్నాప్ కేసు బాలిక పిన్నీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది. చైతన్య మైనర్ బాలికను వారణాసి ఉత్తరప్రదేశ్ తీసుకుని వెళ్లి అక్కడి నుండి హైదరాబాద్ కి తీసుకొని వస్తుండగా పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు సదరు చైతన్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగింది, అదేవిధంగా బాలికను భువనగిరి సఖి కేంద్రంలో సంరక్షణ నిమిత్తం ఉంచడం జరిగింది. నిందితుడిని రామన్నపేట సిఐ ఎన్ వెంకటేశ్వర్లు రిమాండ్ కు పంపించడం జరిగిందని అడ్డగూడూర్ ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు.




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**